
క్లుప్తంగా

పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక



బాపట్ల: బాపట్ల పట్టంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం నూతన పాలక కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నరాలశెట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా రౌతు రామాంజనేయులు, కార్యదర్శిగా కల్లి శ్రీనివాసనాయుడు, జాయింట్ సెక్రెటరీగా కర్పూరపు రంజిత్ కుమార్, కోశాధికారిగా రాగం శివరామ ప్రసాద్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా దాది శేషయ్య, గంటా సాయి బాబు, చామర్తి వెంకట శివరామకృష్ణ ఆంజనేయులు, పెద్దపాటి శివనాగరాజు, కార్యవర్గ సలహాదారులుగా అంకిపల్లి సాంబయ్య, పూజారి కాకి శ్రీనివాసరెడ్డిలను ఎన్నుకున్నారు.

శాకంబరిగా బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని నిజశాకంబరి దేవిగా అలంకరించారు. చతుర్భుజాలతో ధనస్సు, కమలం, అమృత ఫలాలు, అనుగ్రహ ఫలాలు ధరించే త్రినేత్రాలతో పద్మపీఠంపై స్థిరంగా కూర్చుని తన వద్దకు వచ్చే అభక్తులకు కృపా దృష్టి అనుగ్రహిస్తున్నట్లుగా అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్



నిజాంపట్నం: ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన కూచినపూడి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అచ్యుతాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ మట్టిలోడుతో కూచినపూడి వైపు వెళ్తుండగా.. అటుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ కాలవలోకి దూసుకెళ్లగా.. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు కావడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం వైద్యశాలకు తరలించారు. ట్రాక్టర్‌ను మైనర్ బాలుడు అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కమిటీ ఎన్నిక

కర్లపాలెం: ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక పోరు కమిటీ సభ్యులు కోటా ప్రసాదశివరావు తెలిపారు. కర్లపాలెంలోని పెద్దింటమ్మ ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యుల సమావేశం జరిగింది. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శవనం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంపాల వెంకటరెడ్డి, కోశాధికారిగా పిట్టి శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యారం రాజు, దుండి మస్తాన్‌రెడ్డి, కార్యదర్శులుగా మందపాటి ఓబాద్య, బుర్ల సుబ్బారావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు, ఆట్ల బాలాజీరెడ్డి, రఘుపతిరాజు ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కర్లపాలెం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని పాత నేరస్తులకు, రౌడీ షీటర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై నిఘా ఉంచామని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు.

బాపట్లకు తీరిన చెత్త సమస్య..

- 34 మెట్రిక్ టన్నుల చెత్తను యంత్రంతో వేరువేసే పనులు
- 15 క్లస్టర్లుగా చెత్త సేకరణకు ప్రణాళిక
- ఆశించిన మేర.. విజయం సాధించామంటున్న కమిషనర్ భానుప్రతాప్



చెత్తను వేరు చేస్తున్న యంత్రం



ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

బాపట్ల: ఒకప్పుడు బాపట్ల పట్టణంలోకి నలువైపులా ఎక్కడి నుంచి అడుగుపెట్టినా.. చెత్తచెదారంతో ముక్కుపుటలు అదరగొట్టే దుర్గంధం స్వాగతం పలికేంది. ఆ వాసనకే ప్రయాణంలో నిద్రపోతున్నప్పటికీ..బాపట్ల వచ్చింది.. అనే సంకేతం ప్రయాణికులకు మెదిలేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి భావపురిలో మారింది. పక్కా ప్రణాళికతో మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ చేపట్టిన చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. జిల్లా కేంద్రమైన బాపట్లలో ఈ ప్రణాళిక ఎంతో ఉపయోగకరంగా ఉంది.

ప్రతి ఇంటికీ నివేదిక..
34మెట్రిక్ టన్నులు చెత్త సేకరణ

బాపట్ల పట్టణంలో ప్రతి ఇంటి నుంచి పారిశుద్ధ్య కార్మికులు సేకరించే చెత్తకు రాతపూర్వకమైన రికార్డు పనులను సచివాలయం ఉద్యోగులకు అప్పగించారు. బాపట్లలో 300 నుంచి 350 ఇళ్లను ఒక మైక్రో ప్యాకెట్‌గా విభజించారు. 15 మైక్రో ప్యాకెట్లు కలిపి ఒక క్లస్టర్‌గా.. మొత్తం 5 క్లస్టర్లుగా పట్టణంలో చెత్త సేకరించే పనులకు శ్రీకారం చుట్టారు. రోజు 34 మెట్రిక్ టన్నుల చెత్త బాపట్లలో ఉత్పత్తి అవుతోందని గణాంకాలు తయారు చేసి, దీనిని రిసైక్లింగ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.



బండిపై చెత్త సేకరించాల్సిన ప్రాంతాల మ్యాపు

జమ్ములపాలెం డంపింగ్ యార్డులో రీసైక్లింగ్..

బాపట్ల మున్సిపాలిటీలో డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవటంతో ఎన్నో ఏళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏనిమిదేళ్ల క్రితం జమ్ములపాలెం రోడ్డులో 15 ఎకరాల పొలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించారు. ఈ డంపింగ్‌యార్డులో ఎక్కడ పడితే అక్కడ పడేయటం వల్ల చెత్తకుప్పలు 7 నుంచి 8 అడుగులు ఎత్తులో పేరుకుపోయాయి. డంపింగ్ యార్డులోకి ప్రవేశించాలన్న తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఉన్న చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కేవలం రూ.80 వేలు విలువ చేసే.. మిషన్‌ను తీసుకువచ్చి దాని నుంచి చెత్తచెదారం, మట్టిని వేరు చేసే పనులు చేపట్టారు. ఈ విధంగా వచ్చిన మట్టిని వర్మి కంపోస్టులో ఉపయోగించే విధంగా నిర్ణయం తీసుకున్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు



పొడి, తడి చెత్తను అందించే విషయంలో బాపట్ల ప్రజలు సహకరిస్తున్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాలు మేరకు సచివాలయం ఉద్యోగులు చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. చెత్తను కూడా రీసైక్లింగ్ చేసిన తరువాత డంపింగ్‌యార్డులో నర్సరీని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం.

–భానుప్రతాప్,
మున్సిపల్ కమిషనర్, బాపట్ల.

అర్హత ఉంటే.. సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- చెరుకుపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉంటే చాలు ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వస్తాయని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి సచివాలయం–2 పరిధిలో 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలను స్వయంగా అడిగి, తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పందుల బెడద నివారించాలని, చెత్తను వేసేందుకు పుర వీధుల్లో కుండీలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎంపీని కోరారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటరమణారావు మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను, ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ, ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తూచా తప్పకుండా అమలు చేసిందన్నారు. ప్రజా సమస్యలను జగనన్న సురక్ష పథకం పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. దీంతో నూరు శాతం అర్హత ఉన్న వారికి నేరుగా సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి, బండారు రామారావు, మరివాడ ప్రసాద్, ఎల్లెల రవికిరణ్, సర్పంచ్ దేవరకొండ వాణి, ఎంపీటీసీ నాగుల నరసింహారావు, నాయకులు కామినేని కోటేశ్వరరావు, చెన్ను కోటేశ్వరరావు, తూము కోటేశ్వరరావు, తురిమెళ్ల శ్రీధర్, తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బడి జ్ఞాపకాలు కదలించిన..సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నగరం: పూర్వ విద్యార్థులు ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ధూళిపూడిలోని తడవర్తి బాపయ్య స్మారక ఉన్నత పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 39 ఏళ్ల తర్వాత స్నేహితులను కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ.. ప్రస్తుతం తమ రంగాల్లో ఎదుర్కొంటున్న సాధక బాధకలను పంచుకున్నారు. పాఠశాల తరగతి గదుల గోడలను తాకుతూ.. జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు సెల్ఫీలు తీసుకుని.. తీపి గుర్తుగా దాచుకున్నారు. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన, ఆనాటి గురువులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యన్నారాయణ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

నిస్వార్థ నేత తుమ్మల



తుమ్మల నరేంద్రనాథ్ కాంస్య విగ్రహన్ని అవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: గ్రామాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వైఎస్సార్ సీపీ నాయకుడు స్వర్గీయ తుమ్మల నరేంద్రనాథ్‌ను కావూరు గ్రామ ప్రజలు ఎల్లప్పుడు గుర్తు పెట్టుకుంటారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండలంలోని కావూరు గ్రామంలో ఆదివారం రేపల్లె మార్కెటింగ్ యార్డు మాజీ చైర్మన్ తుమ్మల నరేంద్రనాథ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంపీ మోపిదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. ముందుగా ఎంపీ మోపిదేవి గుంటూరు మాజీ జెడ్పీ చైర్మన్ రాయపాటి శ్రీనివాసరావు, బాపుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు నరేంద్రనాథ్ విగ్రహాన్ని అవిష్కరించి, నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మోపిదేవి మాట్లాడారు. తుమ్మల నరేంద్రనాథ్ నిస్వార్థ నాయకుడు అని, ఆయన గ్రామ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. అందుకు నిదర్శనం 2011లో తాను మంత్రిగా ఉన్న సమయంలో మోడల్ విలేజ్‌గా మండలంలో కావూరును ఎంపిక చేసి రూ.2.5 కోట్లతో సిమెంటు రోడ్లు పూర్తి చేశారని గుర్తు చేశారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్, డాక్టస్ సంస్థ అధినేత తుమ్మల రామకృష్ణ, కావూరు సత్యన్నారయణ, కామినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరనిలోటు



శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీలు మోపిదేవి, నందిగం

చెరుకుపల్లి: దాసరి శ్రీనివాసరావు అకాల మరణం ఆరుంబాక పంచాయతీలో వైఎస్సార్ సీపీకి తీరని లోటు అని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఆరుంబాక పంచాయతీ ఏమినేనివారి పాలెం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు(65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీలు మోపిదేవి వెంకట రమణారావు, నందిగం సురేష్, బాపుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి సునీత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీవితంలో ఎదగటానికి చదువే ఉత్తమ సాధనం

ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మ

తెనాలి: జీవితంలో రాణించాలంటే చదువే ఉత్తమ సాధనమని ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మ స్పష్టం చేశారు. అకడమిక్ విద్యతోపాటు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదవాలని సూచించారు. పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యంశెట్టి పాలెంలోని పద్మశాలీయ కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఉత్తమ విద్యార్థులకు బంగారు పతకాలు, ఉపకార వేతనాలు, 209 మందికి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. క్విజ్ పోటీల్లో మొదటి మూడు స్థానాలను సాధించిన గ్రూపులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను బహూకరించారు. సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. మరో ముఖ్య అతిథి భారత ప్రభుత్వ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ (సైంటిస్ట్–డి) నలుమోలు సుబ్రహ్మణ్యం (న్యూఢిల్లీ) మాట్లాడుతూ నిరుపేద కుటుంబ నుంచి వచ్చిన తాను, ఈ స్థాయికి రావటంలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కృషి ఉందన్నారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన కాటాబత్తుల నవ్యశ్రీ, చింపిరి, జక్కా యశ్వంత్ కుమార్‌ను బంగారు పతకాలతో సత్కరించారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థులకు రూ.3 వేల నగదుతో మెడల్స్‌ను ఇచ్చి సన్మానించారు. గంజి ప్రభాకరరావు స్వాగతం పలికిన సభలో డాక్టర్ కటకం పురుషోత్తమరావు, కన్నా మాష్టారు, హరిప్రసాద్, అప్పారావు, రామకృష్ణ, దివి పురుషోత్తం, కటకం శేషగిరిరావు, భాస్కరరావు, ఓంకార్ ప్రసాద్, అక్కల శ్రీరామ్, జొన్నాదుల మహేష్, విద్యాసాగర్, శివశంకర్, పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి ఎంపీ నిధులు మంజూరు



ఎంపీ బాలశౌరికి వినతిపత్రం అందజేస్తున్న చక్రాయపాలెం గ్రామస్తులు

కొల్లిపర : మండలంలోని చక్రాయపాలెంలో కల్యాణ మండప నిర్మాణానికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి నిధులు మంజూరు చేశారు. గ్రామస్తులు గుంటూరు కృష్ణ నగర్‌లోని ఎంపీ నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. కల్యాణ మండపం నిర్మాణం నిధుల కొరత కారణంగా నిలిచిపోయిందని వివరించారు. స్పందించిన బాలశౌరి రూ. 31 లక్షలు, గ్రానైట్ వేయడానికి రూ. 9లక్షలు కలిపి మొత్తం రూ. 40 లక్షల ఎంపీ నిధులు విడుదల చేశారు. చక్రాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చందు నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, బూరెల దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పేరలిలో ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ కాగిత బుల్లియ్య పేర్కొన్నారు. పేరలి గ్రామంలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, ఏపూరి బ్రదర్ హాండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత సూపరిండెంట్ డాక్టర్ రత్నరాజు, డాక్టర్ హజమతుల్లా, డాక్టర్ లాజరస్ 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు జి.మీరయ్య, ఎం.శివరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటలతో శారీరక ధృడత్వం



పేరలి(కర్లపాలెం): క్రీడలతో శారీరక ధృడత్వం, మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదన రెడ్డి తెలిపారు. పేరలి గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన కర్లపాలెం టీంకు రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పేరలి టీంకు రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన బక్కావారిపాలెం టీంకు రూ.5వేల నగదును మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదనరెడ్డి అందజేశారు. గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది దుద్దుకూరి భాస్కర రావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బన్నా రావూరి శ్రీనివాసరావు, అల్లం గోపీకృష్ణ, గిరిజారాణి, ప్రసన్నకుమార్, కిషోర్ ఉన్నారు.

ప్రమాద రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి

రేపల్లె రూరల్: ప్రమాద రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ అన్నారు. పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆకతాయిలు కొంత మంది అతివేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



గణపవరం(కర్లపాలెం): గణపవరం పంచాయతీ బాపూజీనగర్ ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం గ్రీన్ పీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు ఎస్ఐ ఎం.శివయ్య దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ దేవరకొండ అంకమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 100 మందికి దుప్పట్లు అందజేశారు. గ్రీన్‌పీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పిన్నిబోయిన రత్నం, ఎంపీటీసీ సభ్యులు దిండి నాగలక్ష్మి, ఆర్గనైజేషన్ సభ్యులు లక్ష్మీ నారాయణ, టి.డేనియేల్ అంకమరావు, ఇమ్మానియేల్, నాగరాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

అదుపులో ఏడుగురు, రూ.46,630ల సీజ్



కొల్లూరు: ఇటుక బట్టీల మాటున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి సిబ్బందితో కలసి ఆదివారం దాడులు నిర్వహించారు. కిష్కిందపాలెం సమీపంలోని ఇటుక బట్టీలలో పేకాట పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. ఇటుక కళ్లంలోని పాకలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.46,630 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తెనాలి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై తమకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

గ్రంథాలయ ఉద్యమ మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల: నేటి తరాన్ని పుస్తక పఠనం వైపు మళ్లించడానికి పలు సంస్థలు 'మరో గ్రంథాలయ ఉద్యమం'కు శ్రీకారం చుట్టాయని భావపురి పుస్తకోద్యమ సమితి అధ్యక్షుడు డాక్టరు పీసీ సాయిబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఉద్యమ మొదటి మహా సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టరు పీసీ సాయిబాబు మాట్లాడారు. పుస్తక పఠనంలో ఉన్న రుచిని, పసను నేటి యువతకు తెలియచెప్పడం ఈ ఉద్యమం లక్ష్యమని చెప్పారు. విద్యార్థులందరికీ పుస్తక పఠనాన్ని అలవర్చడమే ధ్యేయంగా ఈ సంస్థలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఉద్యమం మొదటి మహా సభ ఈ నెల 16న విజయవాడలోని బెంజ్ సర్కిల్‌లోని సర్వోత్తమ భవన్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. సభను జయప్రదం చేయాలని కోరారు. శాఖ గ్రంథాలయ అధికారి ఎ.శివాజీ గణేషన్, సమితి కార్యదర్శి జీవీ, కోశాధికారి ఎ.మల్లికార్జున పాల్గొన్నారు.

బాబురావు కుటుంబాన్ని ఆదుకుంటాం



ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసిన బాబురావు భార్య మేరీ

బాపట్ల: బాపట్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డు విస్తరణలో దుకాణం కోల్పోయిన బాబురావు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కోన నివాసంలో బాబురావు సతీమణితో వైఎస్సార్‌సీపీ నాయకులు జోగి రాజా సమక్షంలో మాట్లాడారు. దుకాణం తొలగించిన స్థలంలోనే మరో దుకాణం ఏర్పాటు చేసేందుకు ఆమెను ఒప్పించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్ని విధాలుగా ఆదుకుంటామని కోన చెప్పారు. బాపట్ల పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సహకరించాలని ప్రజలను ఆయన కోరారు.

కోమలమ్మ, గంగమ్మలకు 'ఆషాఢం' సారె సమర్పణ



ఆషాఢం సారెతో కోమలమ్మ వద్దకు వెళ్తున్న కోమలి గ్రామస్తులు

పిట్టలవానిపాలెం: కోమలి గ్రామ దేవత కోమలమ్మకు, భవనంవారిపాలెం శివారు చోడిపాలెంలో వేంచేసి ఉన్న గంగమ్మ తల్లికి ఆయా గ్రామస్తులు ఆషాఢ మాసం సారెను ఆదివారం భక్తిశ్రద్ధలతో సమర్పించారు. రవిక, చీర, పసుపు, కుంకుమ, మట్టి గాజులు, పూలు, పలు రకాల పండ్లు, 11 రకాల పిండి వంటలతో పాటు అమ్మవార్లకు అత్యంత ప్రీతికరమైన గోరింటాకులను, పులిహోర, పొంగలి, నైవేద్యాలను సమర్పించారు. కోమలిలో మహిళలు స్థానిక కోదండ రామాలయం నుంచి ఆషాఢం సారెను తీసుకుని ర్యాలీగా మంచినీటి చెరువు వద్ద గల కోమలమ్మ వద్దకు చేరుకున్నారు. సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామల వెంకటప్పమ్మ, గ్రామ పెద్దలు మోదుగుల వెంకటరెడ్డి అమ్మవారికి ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం సారెను సమర్పించారు. రెండేళ్ల నుంచి కోమలమ్మకు ఆషాఢం సారెను సమర్పిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. చోడిపాలెంలో సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, మహిళలు సారెతో దేవాలయానికి చేరుకుని, కనక తప్పెట్లు, మేళాలతో అమ్మవారి ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజలు చేసి, సారెను సమర్పించారు.

ఫ్యాన్లు బహూకరణ



ఫ్యాన్లు బహూకరిస్తున్న హరిబాబు

బాపట్ల అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు, అధ్యాపకుడు వంకాయలపాటి హరిబాబు ఆర్థిక సహకారంతో మూడు సీలింగ్ ఫ్యాన్లను బాపట్ల జిల్లా శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ అంగలకుదురు శివాజీ గణేశన్‌కు ఆదివారం అందించారు. ఉపాధ్యక్షుడు బి.రాంబాబు, కార్యదర్శి ఉపేంద్రగుప్త, ఎం. సుధీర్‌కుమార్ , బి.రామ సుబ్బారావు, కృష్ణారావు, బి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.